# అదృష్టమా?! నీవెక్కడ?

—డా॥ కర్రా సోమశేఖరం

అకస్మాత్తుగా హార్టు ఎటాక్‌తో నాన్నగారు కన్ను మూయడంతో పదేళ్ల తమ్ముడు, ఆరేళ్ల చెల్లి, దిగులుతో వున్న అమ్మ నా బాధ్యతయి కూర్చుంది.

ఆడదాన్నే అయినా బాధ్యతలు విస్మరించలేనుగా. తిరగ్గా తిరగ్గా నాన్నగారి ఉద్యోగం నాకిచ్చారు. కంపెనీ వాళ్లిచ్చిన లక్షరూపాయలు రెండు బాంకుల్లో నెల నెలా వడ్డీ వచ్చేలా ఫిక్సెడు డిపాజిట్‌లో వేసింది అమ్మ.

చిన్న వయసులోనే ఉద్యోగం, బాధ్యతలు అనుకుంటూ దిగులుపడే అమ్మను ఓదారుస్తూ ఆదరాబాదరాగా టిఫిన్ సర్దుకుని ఉద్యోగానికి వెళ్లి రావటం పరిపాటయిపోయింది. నలుగురితో చక్కగా మాట్లాడటం, కలుపుగోలుగా వుండటం బాగానే అబ్బాయి.

కాల చక్రంలో నాలుగేళ్లు వేగంగానే తిరిగాయి. నాన్నగారు పోయారనే దిగులు తప్ప రోజులు బాగానే గడచిపోతున్నాయి. తమ్ముడు, చెల్లాయి బాగానే చదువుకుంటున్నారు. నా జీతం అమ్మ దాచిన డబ్బు మీద వచ్చే వడ్డీతో జాగ్రత్తగా కుటుంబ ఖర్చులు చూసుకుంటు ఏదో కొంత మొత్తంగా నెల నెల ఆర్.డి వేస్తున్నాను.

అమ్మ బాధ్యతల లిస్టులో ఓ మేజరు అయిటం నా పెళ్లి. రెండు మూడు సార్లు ఆ ప్రస్తావన వచ్చింది.


"పెళ్లికేం తొందరమ్మా, నా పెళ్లయిపోతే నన్ను చేసుకున్నవాడు మిమ్మల్ని చూడనిస్తాడా. నా జీతం అంతా అతనే తన్నుకెళితే తమ్ముడు, చెల్లాయిల చదువు వగయిరా ఎలా? చూద్దాంలే రెండేళ్ల తర్వాత...." అంటూ దాటవేశాను.

కళ్యాణ ఘడియ వచ్చినా, కక్కొచ్చినా ఆగదన్నది శాస్త్రవచనం.

మా పక్కింటి బామ్మగారి దూరపు చుట్టం ముప్ఫయి ఏళ్ల అబ్బాయి ప్రయివేటు కంపెనీలో పని, బుద్ధిమంతుడు, తల్లి తప్ప ఇంకే బాదరబందీ లేదు అంటూ ఆ సంబంధాన్ని మోసు కొచ్చి మా అమ్మ ముందుం చింది.

నా పెళ్లి విషయంలో ఈసారి అమ్మ గట్టిగానే ఒత్తిడి చేయటం - కాదనలేక పెళ్లి చూపులు వగయిరా ఏర్పాటు చేయటం, అబ్బాయికి నేను నచ్చటం చకచకా జరిగిపోయింది.

నా మనసులో వున్న భయం అల్లా నేను పెళ్లి చేసుకుని వెళ్లిపోతే అమ్మ, చెల్లి, తమ్ముడు - వాళ్ల బాగోగులు చూసే దెవరు? వాళ్లకయే ఖర్చు లకు డబ్బెక్కడి నుండి వస్తుంది. ఫిక్సెడుకు వేసిన డబ్బు పై వచ్చే వడ్డీలు కూడా అయిదారు వందలేగా. ఏం సరిపోతుంది. అంతా దైవ లీల ఎలా జరగాల్సింది అలా జరుగుతుందనుకుంటే వేరే విషయం.




మనసు స్థిమిత పరచుకున్నాను.

అమ్మదాచి వుంచిన డబ్బులో సగం ఖర్చు చేసి నా పెళ్లి ఘనంగానే జరిపించింది. ముద్దు ముచ్చట్లు బాగానే జరిగాయి.

ఓ పెద్ద బాధ్యత దించుకుంది. దీర్ఘంగా నిట్టూర్చింది.

"అక్కా జాగ్రత్త.... బావగారూ మా అక్కను మంచిగా చూచుకోండేం...." తమ్ముడు చెల్లాయిల అప్పగింతలు.

దూరాన్న అమ్మ పైట కొంగుతో జలజలారాలే కన్నీళ్లను వత్తుకుని చేయి వూపింది సాగనంపే సైగతో.

ఆటోలు కదిలాయి.

కొత్త వ్యక్తి, కొత్త పరిసరాలు, కొత్త జీవితం. ప్రతి ఆడపిల్ల కది సహజమే. సర్దుకోవటంలో తేడా తప్ప ఓ నెలసాఫీగానే సాగింది.

కాపురంలో కలతలు సహజమే అయినా కొన్ని తెచ్చుకోకూడదు.

ఆయన రాత్రుల్లు లేటుగా రావటం, విస్కీ వాసన ప్యాంటు జేబులో రేస్ బుక్ - అమ్మ బాబోయ్ ఈ ఇల్లు గుల్లయిపోదూ - ఆయన ఒళ్లు కుళ్లిపోదూ - ఏదో భయం ఆవహించింది.

ఓ రోజు అత్తగారు పూజ ముగించి కాస్తంత ఎంగిలిపడి పెరటి వాకిట్లో చాప పరుచుకుని మేను వ్రాల్చింది. ధైర్యం తెచ్చుకుని భర్త వ్యవహారమంతా పూస గుచ్చినట్లు వివరించి -

"ఏం చేద్దాం? ఏలా మారుద్దాం?"

అత్తగారు పెదవి విరిచారు.

"పిచ్చి పిల్ల - ఓర్పుతో నెమ్మదిగా సాధించాలి గాని తొందరపడకూడదు. మా వారికి వచ్చిన రిటయిర్మెంటు డబ్బంతా ఈ పుత్ర రత్నమే అశ్వమేధయాగంలో తగలేశాడు. దాంతో పిచ్చెక్కి త్రాగుడు, అప్పుడప్పుడు పేకాట. ఇలా వాడి జీతం నా పెన్షన్ తగలేసుకుంటున్నాడు. పెళ్లయితే మారుతాడేమోనని ఈ పెళ్లి జరిపించా. చూద్దాం కాలమే నిర్ణయిస్తుంది."

అత్తగారు చెప్పిన వేదాంతం నాకు నచ్చలేదు.

ఈ మనిషితో వేగేదెలా? అత గాడిని మార్చేదెలా? నా జీతం కూడా గుంజుకుని తగలేస్తాడా?

కాని ఆ రాత్రి త్వరగానే వచ్చారు. నా చేతిలో మల్లెపువ్వు పొట్లం. వాళ్లమ్మ చేతికి ఆపిల పండు ఇచ్చి బట్టలు మార్చుకుని వంటింట్లోకి దూరారు. చాలా కాలం తర్వాత వండిన వంటకాలు వేడిగా తినటం నాకెంతో సంతోషమనిపించింది.

ఆ రాత్రి ఆనందంగానే గడిచింది.

ఆ మరుసటి రోజు నుంచి గుర్రపు

పందాలు ప్రారంభం. వాటి బాపతు ఓ పెద్ద చిత్తా తెగ తిరగేసి ఏవేవో లెఖ్ఖలు వేసుకుని గుర్రపు పందెంలో బోలెడు డబ్బు కాయటం - పోగొట్టుకోవటం - పిచ్చిపట్టిన వాడిలా మిగిలిన చిల్లర డబ్బుల్తో ఏదో దొరికింది త్రాగేసి తూలుతూ ఇంటికి రావటం ఈ వ్యవహారం చూసి చూసి మనస్తాపంతో విషజ్వరం వచ్చి మంచం ఎక్కింది అత్తగారు. పది రోజులు గడచినా జ్వరం, వాంతులు తగ్గలేదు. అమితమైన నీరసంతో బల్లిలా పడుంటే ఓ రాత్రి ఆ అప్రయోజక కొడుకు చేతికున్న బంగారు గాజును కత్తిరించి పట్టుకుపోయాడు మరుసటి రోజు గుర్రపు పందాలకు.

అంతటి ప్రబుద్ధుడా పుత్ర రత్నం.

మృత్యువుతో పోరాడి పోరాడి ఆఖరి చూపుగా నన్ను చూసి తన మెళ్లో వున్న బంగారపు గొలుసు నామెళ్లో వేసింది. చేతికి మిగిలిన రెండు బంగారు గాజులు నా చేతికి తొడుగుతూనే కన్ను మూసింది.

ఆఫీసులో లోను పెట్టి పది వేలు తెచ్చాను.

ఆమె కర్మకాండలు 11 రోజులు బాగానే జరిపించాం. ఆయన్ను త్రాగకుండా, బయటకు పోకుండా పట్టుకోవటం ఓ బ్రహ్మ ప్రళయమే అయింది.

ఆవిడ పెన్షన్ ఆగిపోయింది.

అతని జీతం అంతంత మాత్రం. దాంట్లోనే పేకాట, త్రాగుడు, ఇక నా జీతంతో ఇల్లు గడపాలి. అనుకోని విషాద సంఘటనలు, మానసిక వ్యథలు, మారని మనిషి గురించి పలు ఆలోచనలు - ఇలా సంవత్సరం గడిచిపోయింది. నా ప్రోద్బలంతో నేను డబ్బివ్వబట్టి అత్తగారి సంవత్సరీకం సవ్యంగానే జరిగిపోయింది.

అమ్మకు పూస గుచ్చినట్లు నా కుటుంబ వ్యవహారమంతా వుత్తరం రాశాను.

“జీవితాన్ని చింపిన విస్తరి చేసుకోకమ్మా ఓర్పుతో నెట్టుకురా. అతన్ని మార్చటానికి ప్రయత్నించు. అందరి కుటుంబాల్లోను ఏవో సమస్యలు, అపార్థాలు, అపోహలు, అప్పులు వున్నవే. సర్దుకుపోవాలమ్మా. చదువుకున్న దానివి. జాగ్రత్తగా కాలక్షేపం చేసుకో” సలహాలతో తల్లి జాబు రాసింది.

ఈ త్రాగుబోతు భర్తతో ఎలా జీవితం సాగించాలి. ఎందుకు సాగించాలి. ఏమిటీ వింత పిచ్చి బ్రతుకు. ఎవరినుద్ధరించడానికి.

ఎక్కడెక్కడో చాలా అప్పులు చేసి ఓ రాత్రికి రాత్రే చెప్పా పెట్టకుండా వూరు విడిచి వెళ్లిపోయారు. ఎంతోమంది తలుపు తట్టటం గుచ్చి గుచ్చి అప్పులు అడగటం. కంపెనీ వాళ్లు రిజిష్టర్డు లెటర్ పంపారు. ఓ నెల గడువు లోపులో డ్యూటీకి జాయినవాలని.

మనిషి జాడేది.

ఓ నెల గడిచాక మరో రిజిష్టర్డు లెటర్ కంపెనీ నుంచి వచ్చింది. ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఆర్డరు, అరవై వేలకు ఓ చెక్. అదృష్టం కొద్దీ మా ఇద్దరి పేరజాయింటు బ్యాంకు ఎక్కౌంటు వుండబట్టి ఆ చెక్ బ్యాంకులో వేసి ఆ డబ్బు డ్రా చేసి చిన్న చితక అప్పులు, ఇంటి అద్దె కట్టేసి పెట్టె సర్దుకుని అమ్మ ఇంటికి వెళ్లిపోయాను.

ఓ సంవత్సరం తిరిగింది. యాంత్రికంగా ఆఫీసుకు వెళ్లి వస్తున్నాను.

ఎక్కడెక్కడో తిరిగి మాసిన గడ్డంతో బక్కచిక్కి మళ్లీ ప్రత్యక్షమయ్యాడు నా భర్త ఓ రోజు ఉదయాన్నే.

మళ్లీ పాత పాటే. డబ్బు..... డబ్బు.... మనిషి దగ్గరగా నుంచుంటే చాలు విస్కీ వాసన. కొంత డబ్బు మొహాన కొట్టి పంపించేశాను.

కుదుట పడుతున్న మనసులో కలకలం.

నాకు తెలుసున్న దూరపు బంధువు లాయరు. ఆయన్ను కలసి నా కుటుంబ వ్యవహారమంతా వివరించి చెప్పాను. ఎలాగయినా విడాకులు ఇప్పించమని ప్రాధేయపడ్డాను.

తగినన్ని ఆధారాలతో విడాకుల కేసు ఫైలు చేశారాయన.

ఓ నెల గడిచాక ఆయన మళ్లీ డబ్బుకు వచ్చారు. ఆయన్ని ఇంట్లో కూర్చో పెట్టి లాయరును మరో పెద్ద మనిషిని పిలుచుకు వచ్చాను. వాళ్లిద్దరూ కలసి ముఖ్యమైన స్టాంపు పేపర్ల మీద సంతకాలు తీసుకున్నారు. ఆఖరిసారిగా కొద్ది డబ్బు అతని చేతిలో పోసి ఇంకెప్పుడూ నా జోలికి రానన్నట్లుగా మరో హామీ పత్రం కూడా రాయించుకుని ఆ సంసార కాండకు తెరదించేసి వూపిరి పీల్చుకున్నాం అంతా.

మానసికంగా కోలుకుంటున్నాను. ఆఫీసు మిత్రులతో కలసి టూర్లకు వెళ్లటంతో కొంచెం విశ్రాంతి, ఆనందం చోటు చేసుకున్నాయి. జీవితంలోని చేదు గుర్తులు చెరగిపోతున్నాయి.

చెల్లాయి పెళ్లి కెదిగింది. అమ్మ దగ్గర వున్న డబ్బు నేను కొంచెంగా దాచిన డబ్బుతో ఎలాగయినా మంచి పిల్లవాడిని తెచ్చి పెళ్లి చేసి ఇంటికో మగ దిక్కుతేవాలని నిర్ణయించుకున్నాం. ముఖ్యంగా కుర్రాడు బుద్ధిమంతుడు, గవర్నమెంటు ఉద్యోగం వుండాలని నా నిర్ణయం. అదృష్టం కొద్దీ మా దూరపు బంధువులబ్బాయి బ్యాంక్‌లో పని చేస్తున్నాడు, బుద్ధిమంతుడు. ఆ సంబంధం ఖాయం చేయగలిగాం.

చెల్లెలి వివాహం ఘనంగానే చేసి అత్తవారింటికి

**(70వ పేజీ చూడండి)**

## 'టైపు మార్చాలి'


ఈ రోజు పది సినిమాలు రిలీజైతే... ఆ పది సినిమాల్లో ఎనిమిది సినిమాల్లో ఎల్.బి. శ్రీరాం ఉంటున్నాడు. సంతోషం. అయితే సినిమాకి సినిమాకి మధ్య గెటప్ విషయంలో స్పష్టమయిన మార్పు చూపించాలి. రెండవది డైలాగ్ మాడ్యులేషన్ విషయంలో రొటీన్‌గా చెప్పిన స్టయిల్‌లోనే చెప్పి బోరు కొట్టించకుండా... నటుడిగా కొంత ప్రయత్నం చేసి తను నటించే పాత్రకు ఓ ఐడెంటిటీని సాధించాలి. ఈ టైపు మార్చాలి. అప్పుడే ప్రేక్షకులు ఆనందిస్తారు.



## గత వైభవం



ఇ.వి.వి. పుట్టినరోజు పండగ ఘనంగా జరుపుకున్నాడు. ఈ పుట్టినరోజు ఓ ప్రత్యేకతని సంతరించుకుంది. కారణం ఇ.వి.వి. మళ్ళీ తన పాత ట్రెండ్‌లో సినిమాలు తీయడానికి కంకణం కట్టుకోవడం. ఇప్పుడు తయారుచేస్తున్న చిత్రాలన్నీ ఇ.వి.వి. మార్కు చిత్రాలు కావడం. ముఖ్యంగా వినోదం ప్రధానమైన కథలకి పెద్ద పీట వేయడం ఇవన్నీ ఫిలిమ్ నగర్‌లో ప్రధానంగా చర్చనీయాంశాలైనాయి. కమిటెడ్ చిత్రాలు తీస్తున్నపుడు లేని గుర్తింపు, ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలు తీస్తున్నపుడు మొదలైంది. మరదే ఇ.వి.వి. స్టయిలంటే! మళ్ళీ గత వైభవం రావడం ఖాయం! అంటున్నారు సినీ పండితులు.



## 'తేజ' అంకుల్‌కి తెలుసు!

'చిత్రం' చిత్రం ద్వారా చిత్రంగా సక్సెస్ అయిన నటుడు బబ్లూ.

బబ్లూ తమాషా గెటప్‌లో ప్రేక్షకుల్ని అలరించాడు. తాజాగా రిలీజైన 'ఫేమిలీ సర్కస్' సినిమాలో కూడా బబ్లూకి చాలా మంచి పేరొచ్చింది.

బబ్లూ మాట్లాడుతూ నాకు 'చిత్రం'లో, 'ఫేమిలీ సర్కస్'లో మంచి పేరొచ్చినా అదంతా తేజ అంకుల్ చలవే!

విసుక్కోకుండా సరదాగా నవ్విస్తూ నాచేత యాక్ట్ చేయిస్తున్నారు అంకుల్ చేయమన్నట్లు చేశాను తప్ప నాదేం లేదు. భవిష్యత్‌లో పెద్ద కమేడియన్‌ని కావాలని నా కోరిక! అంటూ కొండంత ఆశతో ఉన్నాడు బబ్లూ.

## అదృష్టమా?! నీవెక్కడ?

(67వ పేజీ తరువాయి)

పంపించేశాం.

నా జీవితమే ఇలా అడవి కాచిన వెన్నెలయి పోయిందని తరుచూ బాధపడ్తోంది అమ్మ. ఏం చేస్తాం జరగాల్సింది జరగకపోదు. విధి బలీయం.

అయిదేళ్లు కాలగర్భంలో కలిసి పోయాయి.

తమ్ముడికి ఓ మంచి కంపెనీ తరపు నుంచి స్టేట్సుకు వెళ్లే ఛాన్సు వచ్చింది. ఓ నెలలో వాడి ప్రయాణం. తమ్ముడు కూడా వెళ్లిపోతే అమ్మా, నేను బిక్కు బిక్కుగా మిగిలిపోతాం.

ఇంతలో ఓ మెరుపు -

గతంలో నాకు విడాకు లిప్పించిన లాయరుగారు నాకో రెండో పెళ్లివాడి సంబంధం తీసుకు వచ్చారు. అమ్మ నిర్లిప్తంగా నావైపుకు తోసిందాయన్ని.

"నలభై ఏళ్లు వచ్చేసాయి. ఇప్పుడు వివాహం ఎందుకమ్మా. శేష జీవితం ఇలాగే గడిపేయాలని వుంది. కుదుట పడుతున్న మనస్సు మళ్లీ గజి - బిజి అవుతోందమ్మా. వద్దమ్మా పెళ్లి వద్దమ్మా."

"నీ జీవితం ఇలా మోడువారి పోవాలా అమ్మా. ఆడదానికి మగాడే దిక్కు. కష్టం సుఖం కలసి పంచుకోవాలి. కలసి జీవించాలి. వంశాన్ని నిలబెట్టుకోవాలి. నీ తమ్ముడు అమెరికా వెళ్లి సెటిల్ అయ్యాక నన్నూ తీసుకు వెళ్లిపోతే నువ్వు వంటరి దానివి అయిపోవూ. రెండో పెళ్లివాడయినా గవర్నమెంటు ఉద్యోగం బుద్ధిమంతుడట. ఒప్పుకోమ్మా." తల్లి ప్రాధేయపడింది.

రెండో పెళ్లి - రెండవ జీవిత భాగస్వామి రెండవ సంసారం సాఫల్యమో - వైఫల్యమో అనుకుంటూ ఆ ఇంట్లోకి అడుగు పెట్టాను.

ఆయనకు పదేళ్ల బాబు. బాబులో తమ్ముడ్ని చూచుకుంటూ బాబును ప్రేమతో పెంచుతూ సాఫీగా జీవితం గడిపేస్తున్నాను. కాన్సరుతో మరణించిన ఆయన మొదటి భార్య గురించి పడే దిగులు చాలా సార్లే గమనించాను.

ఓ రోజు రాత్రి ఆయన త్రాగొచ్చారు.

నిలదీసి అడిగితే చనిపోయిన మొదటి భార్య తీపి గుర్తులు మరచిపోటానికి త్రాగారట.

అదేం సిద్ధాంతమో మరి.

"ఓ యాభై వేలు కావాలి - తేగలవా?" త్రాగిన మైకంలో నములుతూ మాట్లాడాడు.

"దేనికి?"

"ఆవిడ కాన్సరు జబ్బు కోసం తెచ్చిన అప్పు తీర్చేయటానికి."

"అప్పు తీర్చటానికా - మీ త్రాగుడుకా?"

"నా త్రాగుడుకు నా జీతం చాలు. ఆ అప్పు తీర్చేస్తే మనం ప్రశాంతంగా వుండచ్చు."

"ప్రశాంతం - ఇంకెక్కడి ప్రశాంతం. ఆఫీసులో అప్పుతీసుకుని, ఆ అప్పు కట్ చేసి ఇచ్చే జీతం సగం జీతమే. ఏభై వేలు ఎక్కడి నుంచి తేవాలి. సంసార సుఖం కోసం డబ్బు కోసమేనా నన్ను పెళ్లి చేసుకుంట. ఏమిటీ గజిబిజి జీవితం నా తలరాత కాకపోతే. నాగరిక సమాజంలో కూడా రెండు సార్లు మోసపోయానేమిటి?"

నా తలరాత కాకపోతే -!

❋

## పిల్లలు మొదటిసారిగా స్కూల్‌కి వెళ్తుంటే....!

(69వ పేజీ తరువాయి)

తుందని, అక్కడ పిల్లలను ప్రేమగా చూసేవారెవరూ ఉండరని అనుకుంటారు. దీని వలన వారు తమని తాము మానసికంగా స్కూల్‌కి వెళ్ళడానికి తయారుచేసుకోలేరు. ఇలాంటి పిల్లలు స్కూల్ పేరు వింటేనే భయపడుతుంటారు.

పిల్లలు ఈ పరిస్థితికి గురికాకుండా ఉండా లంటే తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్న పిల్లలముందు గానీ లేదా వారికంటే పెద్దపిల్లలతోగాని స్కూల్‌ని గురించి చెడుగా మాట్లా డకూడదు. పిల్లలను స్కూల్‌కు వెళ్ళడానికి మానసికంగా తయారు చేయాలంటే వారికి స్కూల్లో ఆడుకోవడా నికి చాలా పెద్ద గ్రౌండు ఉంటుందని అక్కడ చిన్న చిన్న కుర్చీలు, బల్లలు ఉంటాయని చెప్పాలి. అంతేకాకుండా అక్కడ చాలామంది చిన్నపిల్లలు ఉంటారని, టీచర్లు మంచిగా, ప్రేమ గా ఉంటారని చెప్పాలి. ఇలాంటి మాటలు అప్పు డప్పుడూ చెబుతుం డటం వలన పిల్లలను స్కూల్‌కి వెళ్ళడానికి మానసికంగా తయారు చేసినట్లు అవుతుంది.

మూడు, మూడున్న రేళ్ళ వయస్సు పిల్లలకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం లో తల్లిదండ్రులు సహా యపడాలి. పిల్లలకు వాళ్ళంతట వారే బాత్ రూమ్‌కి వెళ్ళడం, తొందరగా పడుకో వడం, పొద్దున త్వరగా లేవడం, బ్రష్ చేసుకో వడం, అన్నం తినటం లాంటివి చేసుకోవడం నేర్పించాలి. దీనివలన పిల్లల గురించి ఇతరులు పట్టించుకోవలసిన అవసరం రాదు. పిల్లలు తమ పనులు తామే చేసుకోగలుగుతారు.

స్కూల్‌కి వెళ్ళడానికి కొద్దిరోజులు ముందుగానే స్కూల్‌బ్యాగ్, లంచ్‌బాక్స్, వాటర్‌బాటిల్ ఎలా వాడాలో నేర్పడం మంచిది.

పిల్లలను స్కూల్‌కి పంపించడానికి తల్లిదండ్రులు ఇద్దరూ కలిసి వారిని రెడీ చేయాలి. మొట్ట మొదటిరోజు తల్లిదండ్రులిద్దరూ పిల్లలను స్కూల్లో దించడానికి వెళ్ళాలి. టీచర్‌ను కలిసి తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోమని చెప్పాలి. స్కూల్లో ఇంటి ఫోన్ నంబర్ ఇస్తే పిల్లలకు ఏదైనా ఇబ్బంది వచ్చిన ప్పుడు వారికి సమాచారాన్ని అందించడానికి అను వుగా ఉంటుంది.

కొందరు తల్లులు పిల్లలు స్కూల్‌కి వెళుతుంటే ఏడుస్తుంటారు. అక్కడ పిల్లలు ఎలా ఉండగలరో అని బాధపడతారు. పిల్లలు స్కూల్‌కి వెళ్ళడం అనేది అతిసాధారణమయిన విషయం. అందరి పిల్లలూ వెళ్తున్నట్లే మీ పిల్లలు వెళుతున్నారు. దీనిని చిన్నవిషయంగా తీసుకోవాలే తప్ప ఆందోళన పడ కూడదు. పిల్లల భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉండాలంటే వారికి చదువు చాలా అవసరం అనే విషయాన్ని తల్లులు గుర్తుపెట్టుకొని పిల్లలకు ధైర్యం చెప్పి తాము కూడా ధైర్యంగా ఉండాలి.

- మ. భారతి